

# దరిచేరిన కెరటం

వి. హెచ్ఆర్. సుంకర

బీచ్‌నిండా 'పున్నమి వెన్నెల' పాలనురుగులా వ్యాపించి పోయింది!

హద్దులుదాటే ప్రయత్నంలో.. ''అలలు..'' నిర్విరామంగా విరుచుకు పడుతున్నాయ్!

ఆకాశంలోని చుక్కల్ని వెక్కిరిస్తూ... లంగరేసు కున్న ఓడలోని 'దీపాలు' మిలమిలలాడిపోతూ... నీటికి... నిశీధికి... 'నగిషీలు' చెక్కుతున్నాయ్!

నింగికీ - నేలకూ 'అనుసంధాన' కర్తగా వ్యవహ రిస్తున్న 'గాలి' సముద్రుని 'సావాసంతో' సోమరిగా మారిపోయినట్టు -

కదిలీ కదలనట్లుగా కదులుతోంది!

గుప్పెట నిండా 'ఇసుక' తీసుకుని పార బోస్తూ-

పరిపరి విధాల ఆలోచన్లతో సతమతమౌతూ-

తన సమస్యకు పరిష్కారం... 'చావే' నన్న -

'అంతిమ నిర్ణయాన్ని' - మరింత బలపర్చు కుంటూ...

జనసంచారం అంతగా లేని ... ఓ 'బోటు చాటున' కూర్చున్న .. 'ఆమె' ఆటుపోటులతో అల్లల్లాడిపోతూ - సుడిగుండంలో చిక్కిన నావలా వుంది!

జ్ఞాపకాల గాలివానకు తడిసిపోయి... వణుకు తున్న 'గువ్వపిట్టలా...' వుంది.

తను... ఒకప్పుడు ఇదే బీచ్‌లో... ఇక్కడే... ఎన్నెన్ని 'మధురోహల' భవ్యహర్మ్యాలు నిర్మించు కుంది? పున్నమికి పొంగిన సంద్రంలా -

అతని స్పర్శతో ఎగసిపడిన 'ఎద సొదలకు' ఎన్నెన్ని రూపాల్ని ఆపాదించి - 'జీవితం...' సుధా మయమవుతుందని... ఆశలు పెంచుకుంది?

దాదాపు... అయిదు వసంతాలకాలం!

జీవితమంటే... 'ఓన్లీ.. నువ్వ్యాష్లస్ నేను..'' అని రాసుకున్న 'బాస'లు ఒకే ఒక కెరటపు దెబ్బకు - చెరిగిపోయాయి! ఆ కెరటమే... 'వసంత్!'

గ్రాడ్యుయేషన్‌తో మొదలైన తమ పరిచయం - గ్రాడ్యువల్‌గా ... 'ప్రేమ'గా మారి - 'కళ్యాణ వేదికకు' దారితీస్తుందనే భావించింది తప్ప... ఇలా ... సముద్రుని ఒడిలోకి!

ఆ... ఆలోచనల ధాటికి తట్టుకోలేనట్టు -

ఆమె నేత్రాలు ... అశ్రు వాహినులే ... అయ్యాయి!

ఆమె... 'మధురిమ''

ఎంఏ... సైకాలజీ స్టూడెంట్!

ఒత్తయిన కురులతో ... అయిదూ ... ఆరు హైట్‌తో ... ప్రత్యేకంగా కన్పించే 'మధురిమ' - చూడగానే 'స్టన్నింగ్ బ్యూటీ' అనిపించకపోయినా - మరోసారి చూడలేకపోతే - ''ఆరే! ఏదో మిస్సయి పోయామే!'' అన్నంత ఫీలింగ్‌ను కల్గించేంత 'అందం' .... 'ఆమె' సొత్తు!

తలంటు పోసుకున్న ప్రతిసారీ ... నిడుపైన జుట్టును ఆరబెట్టుకుంటుంటే -

'ఏయ్.. మధూ! కారుమేఘాల కిరీటాన్ని ధరించే... 'చందమామ' కన్నా.. నువ్వే అందంగా ఉన్నావే! అంటూ ... తనివితీరా ముద్దాడే.. 'రూమ్మేటు', 'అర్పిత' - 'మధురిమ!' అంటే? 'మేఘాల రాకుమారేనా?' అని ప్రశ్నించే స్థాయికి తీసుకెళ్ళి ... పాపులర్ చేసిందంటే - అందులో వున్న సెవెంటీ పర్సంట్ క్రెడిట్ ... 'మధురిమ' అందానిదే!

'యూనివర్శిటీక్యాంపస్'లో ఆమె అందానికి ఎంత 'ఫాలోయింగ్ వుండేదో ... అంత కంటే ఎక్కువ 'ఫాలోయింగ్' ఆమె వ్యక్తిత్వానికుండేది!

ఆమె వస్తుంటే - ఎలాంటి 'రౌడీ స్టూడెంటై'నా ... 'సైలెంట్' అయిపోయేవాడు!

ఆమె... ఎక్కువగా మాట్లాడేది కాదు!

చూపులతోనే శాసించేది!

ప్రొఫెసర్స్‌కుకూడా ... 'మధు' అంటే దడే!

ఆమె నాలెడ్జి ... అనితరసాధ్యం!

గ్రాడ్యుయేషన్‌లో సంపాదించిన ... 'గోల్డ్ మెడల్' 'ప్రజెంటేషన్' నాడే-

''పోస్ట్ గ్రాడ్యుయేషన్స్ - గోల్డ్‌మెడల్ కూడా.. నీదే'' అంటూ ప్రశంసించిన ... 'వైస్ ఛాన్సలర్' పొగడ్త... అతిశయోక్తి కాదు... అక్షరాలా... నిజం!

అటువంటి ... 'జీనియస్'

అందాల 'మాధురి...'

'వసంత్' అనే రోమియో ... లవ్‌ట్రాప్‌లో ... చిక్కుకు పోయింది!

'వసంత్!' ఇంజనీరింగ్ స్టూడెంట్... హైగా... 'అర్పిత' బ్రదర్.

వసంత్ సిస్టర్... 'అర్పిత' కు.. 'మధు' అంటే ... ఆరోప్రాణం!

అర్పిత మూలంగా ... పరిచయమైన 'వసంత్' ...

తన జీవితంలోకి... 'మధు వసంతంలా' ప్రవేశించాడని ... మురిసిపోని ... 'క్షణం' లేదు!

గాఢమైన ప్రేమావేశంలో.. అతనో 'గ్రీష్మం'లా...

తన జీవితాన్ని ... కాల్చేస్తాడని - వూహల్లో


**రూ.2,50,000 విలువైన బహుమతులు గెలుపొందండి** (ప్రవేశరుసుము లేదు)

| | | |
|---|---|---|
| 7 | 6 | 11 |
| 12 | 8 | 4 |
| 5 | 10 | 9 |

సహాయం కోసం నమూనా

ప్రత్యేక బహుమతి: హీరోహోండా మోటార్‌సైకిల్ లేదా కలర్ టి.వి.


| | | |
|---|---|---|
| 9 | | |
| | 10 | |
| | | 11 |

**కన్సోలేషన్ బహుమతి:** మ్యూచువల్ బెనిఫిట్ చెయిన్ లింక్ పథకం క్రింద టూ-ఇన్-వన్, ట్రాన్సిస్టర్, ఫోటోగ్రాఫిక్ కలర్ కెమెరా, చేతిగడియారం, ఇచ్చిన నమూనా ప్రకారం 9 ఖాళీ చదరాలు తయారు చేయండి. 6 నండి 14 వరకు గల అంకెలనుపయోగించి, నిలువుగా, అడ్డముగా మరియు ఏటవాలుగా ఎటుకూడినా మొత్తం '30' వచ్చేలా చూడండి. ఒక అంకె ఒకేసారి ఉపయోగించాలి. మీ ఎంట్రీలను ఆర్డినరీ మెయిల్ ద్వారా కాంపిటీషన్ పోస్ట్ కార్డ్/ ఇన్‌లాండ్/ఎన్వలప్ పైన 10రోజులలోగా పంపించాలి. మొదటగా స్వీకరించిన 20 ఎంట్రీలకు టైటాన్ చేతి గడియారం ఉచితంగా బహూకరించబడును.

**HERO ENTERPRISES (WAJ)**

**VASUNDHRA Encl., Delhi- 110096**






సైతం.. అనుమానించలేకపోయింది.. 'మాధురి!'

'వసంత్' ఆమెకు... పూర్తిగా... వ్యతిరేకి.

'లవ్' అనేది ... ఓ 'గేమ్' మాత్రమే... అతనికి.

'మిస్ యూనివర్సిటీ' లెవెల్ బ్యూటీతో... 'ఆగేమ్' ఆడడం.. అతనికో సరదా వంటి 'శాడిస్టిక్ - శాటిస్‌ఫేక్షన్!' దట్స్ ఆల్!

అతని అంతరాన్ని... అంచనా వేయలేని... 'మధురిమ' అతని... 'లవ్‌ట్రాప్'లో... బయట పడలేనంతగా - కూరుకుపోయింది!

'ఏయ్ మధూ! ఐయాం... 'వెరీ! వెరీ లక్కీ ...' యూనో?

బికాజ్... 'నా ప్రాణ స్నేహితురాలే... నా కాబోయే వదిన!'

మురిపెంగా ముద్దులు పెడుతూ - 'హ్యాపీ'గా ఫీలయిపోతున్న - అర్పితను చూస్తూ...

'ఏయ్... అర్పితా! నీకంటే నేనే లక్కీ బికాజ్ ... 'వసంత్' లాంటి... మంచి మనసున్న అబ్బాయి నాకు దొరికాడు! నీక్కూడా దొరికితే... అప్పుడు.. 'యూవారాల్సో' ... లక్కీ!

'సరేగాని 'మధూ'... నాదో చిన్న డౌటే?

'డౌటా?... అర్పితకు డౌటా!..'

'అబ్బా! చదువు విషయం కాదే!.. మరే... అదే ... అదంటే... అన్నయ్యా... నువ్వూ... 'హం... తుమ్... ఏక్... కమరేమె ...' పాట పాడేశారా? అనేదే 'బి'కాజ్.. వాడు... చాలా ఫాస్ట్!'

'ఏయ్... అర్పితా... నా సంగతి తెలుసుగా... మనసును మాత్రమే ... అర్పించేసి ... ఇలా విన్నవించుకున్నాను.

'అయ్యా!' అర్పిత అన్నయ్య మహాశయా!

''అర్పించుకోవడం' - 'సమర్పించుకోవడం' లాంటివన్నీ ... పెళ్ళయిన తర్వాతేనని...''

- చివరకు ... 'అదొక్కటే' తాను ... వసంత్ నుంచి కాపాడుకోగలిగింది?

''అవమానమనేది...'' శరీరానికే తప్ప మనసుకుండదా?

'శీలం' కోల్పోవడమంటే!?

శారీరకమే తప్ప - మానసికం కాదా!

కొండంత నమ్మకాన్ని - ఆత్మీయతను - అనురాగాన్ని కోల్పోవడమంటే... 'శీలం' పోయినట్టు కాదా?

నా దేహంలో వున్నది.. నా మనసు కాదా?

ఏమో? ఈ సంఘం... 'సైకాలజీ' అర్థమై చావదు!

అసలు... తనుమాత్రం ఏం... అర్థం చేసుకోగలిగింది? అన్ని సంవత్సరాలు... 'ఆ గోముఖ వ్యాఘ్రం'తో... చెలిమి చేసి - చెట్టాపట్టాలేసుకుని తిరిగింది!

అతని సైకాలజీని ... అణువంతైనా ... అర్థం చేసుకోగలిగిందా?

రేపు... తాను 'లెక్చరర్'గా ... చెప్పబోయే ... సైకాలజీ ... వట్టి ... 'ట్రాష్!'

'అయినా... తాను.. చనిపోబోతూ... లెక్చరర్ గా!' విషాదంతో విలీనమైన.. మందహాసమొకటి -

తొంగి చూసింది... ఆమె పెదాల మీద!

అయిదు సంవత్సరాల అనుబంధం!

ఒకే ఒక్క... కారణంగా... ముక్కలు ముక్కలై పోయింది!

'మధూ! ఐ యాం... సారీరా! మా మదర్ కండిషన్ నీకు తెలుసుగా! అసలే హార్ట్ పేషెంట్! అర్పిత నీకు చెప్పే వుంటుంది!

ఆమె 'మేనకోడల్ని ...' చేసుకోకపోతే ... 'గుండాగి' చచ్చిపోతుంది.

నువ్వు... 'ఎడ్యుకేటెడ్ గర్ల్‌వి...' యుకెన్ అండర్‌స్టాండ్... మై... 'పొజిషన్...' మా అమ్మ కోసం... తలొంచక తప్పలేదు. సారీ... 'వెరీ - వెరీ ... సారీ...' ప్లీజ్... ఫర్ గివ్‌మి'

తీరం చేరుస్తుందని నమ్మిన నావ ... నట్టేట్లో ముంచేసిన ఫీలింగ్!

ఒక 'ఫూల్' ముందు తనో 'ఫూల్'లా.. నిలబడ్డం!

తనకే శక్తుంటే... అప్పుడే... అక్కడే... ఆత్మార్పణ చేసుకునేది!

''వసంత్! మన ప్రేమనీ, బంధాన్ని... కేవలం ... నీ తల్లి 'గుండె...' ఆగిపోతుందనుకుని... కాలరాస్తున్నావే! మరి... నా 'గుండె' పగిలిపోదా? ప్లీజ్ వసంత్! ... మరొక్కసారి ఆలోచించు''

తనెంత పిచ్చిగా మాట్లాడిందో ... ఇప్పుడు అర్థమవుతోంది!

ఓ 'బిచ్చగత్తె'లా... యాచించిన ఫీలింగ్!

'సారీ మధూ! వెరీ.. వెరీ సారీ.'

వసంత్... పలికిన ఆ వాక్యం ... విలువ ... యాభై లక్షల కట్నమని ... అర్పిత చెప్పినప్పుడు ...

వాడిని ... 'ఆ బాస్టర్డ్‌ని...' కిల్ చేసేయాలన్నంత ... ఆవేశం... వచ్చింది!

'ఐ హేట్ దట్ స్కాండల్ లైకెనీ థింగ్' అనుకుంది.

ఆ నిర్ణయ 'పర్యవసానమే...' ఇలా... ఇక్కడ ... ఒంటరిగా... 'మృత్యు దేవత' పరిష్వంగంలోకి ... వెళ్ళడానికి...

ooo

ఆమె ఆలోచన్లను భంగం చేస్తూ...

ఏవో మాటలు! అదీ చాలా దగ్గరగా!


బోటుకు... రెండో ప్రక్క నుంచే!

ఆశ్చర్యపోతూనే... ఆలోచన్లను కట్టిపెట్టి... ఆలకించసాగింది!

'ఏమే! మాణిక్యమా! సముద్రంలో కెల్లిన 'నూకడి'కోసం... సాయంకాలంనుంచి... సతమతమైపోతున్నావ్! నీ పెళ్ళికి ముందు... 'సిమ్మాద్రి' గాడంటే పడి చచ్చేదానివి కదే!

ఛీ .... ఆడి మాటెత్త కప్పు! ఆడో పిరికి నాయాల!

పీనాసిగొట్టు ముకం - కాసుల కాశపడి -




దిబ్బ ముఖం ... కనకాన్ని చేసేసుకున్నాడు!

నాకేటి తక్కువ? కండల్లో బలముండాది!

కల్లల్లో ఎలుగుండాది! కావాల్సినంత అంద ముండాది!

పో ... పోరా ... పోరంబోకు నాయాలా! అని ఎడంకాల్తో తన్నేసి ... ఆడి బాబునాంటి - 'నూక రాజును' మనుమాడేసినా ... మా అయ్య - 'తలతా కట్టెట్టె'నా ... 'కాసులిచ్చి ...' కాలు కడగానంటే ... నేనేమన్నానో తెల్సా?

ఆడు ... నన్ను వద్దనడమేటి? ... నేనే ఆడ్ని ... వద్దంటున్నా! ఆ 'ఏబ్రాసి' ముకం గాడిని... ఎదురు కట్నమిచ్చినా... 'మనువాడ' నని.

'మీ అయ్య ... అంతా చెప్పాడు ... సిమ్మాద్రి వద్దనగానే నువ్వేదైనా ... అగాయిత్తెం చేసేస్తవేమో నని ... తెగ ఇదైపోయ్యాడు ... తెలుసా?'

'ఏటీ ... ఏటన్నవ్! ఆడెవడో... మూణ్ణాల ముచ్చట్లాంటి... ఏబ్రాసి యెదవకోసం ... కన్నోల్ని, కావలసినోల్ని వదులుకుని ... సత్తననుకున్నావా! ఓసోసి! అంత ఎర్రిముకంలా కన్పిత్తన్నానేటి! 'నూక రాజు' నన్నెట్ల చూసుకుంటాడో తెల్సుగా! ... చావమంటే ఆడికోసం ... చస్త ... ఆనందంగా!

'నా కోసం ఏడ్చే వానికోసం... నేనేడుత్తా గాని- 'సిమ్మాద్రి' లాటి 'గాలి యెదవల'కోసం - ఏడ్చుడు కూడా ... ఎర్రితనమే!'

సర్లే! ఆ సిమ్మాద్రెదవ మాత్రం... సుకపడి చచ్చాడా? పాడా? కాసులెత్తిచ్చిన 'కనకం' ఈడ్నే... 'వునకం' లా చూత్తంటె!

'మధురిమ' మస్తిష్కాన్నెవరో ... 'డైనమైట్' తో పేల్చేసిన 'ఫీలింగ్!'

''ఆడికి లేని బుగులు... నాకెందుకు చెప్పు?

ఆ తిరిగినన్నాళ్ళు ... ఆడూ సుకపడ్డాడు ... నేనూ - సుకపడినా! ఆడదానికైనా ... మగాడికైనా... ఒకటే నాయం కాదేటి?''

'కళ్ళ ముందు కమ్ముకుపోయిన ... తెరలు ... నెమ్మదిగా ... తొలగిపోతున్నట్టు...

కారు మబ్బుల మధ్య ... కాంతికిరణం తొంగి చూసినట్టు...

తనెంత మూర్ఖంగా... ఆలోచిస్తోందో...

ఒక్కసారిగా... 'రియలైజ్' అయిపోయింది... 'మధురిమ!'

తన సైకాలజీ... ఒట్టి ట్రాష్!

అమాయకంగా కన్పించే... ఈ అక్షరజ్ఞానం లేని ... అమ్మాయికి... 'జీవితం' అంటే.. ఎంత అవగాహన? ఎంతటి 'పాజిటివ్' థింకింగ్?

యస్ ... మూణ్ణాళ్ళ పరిచయం కోసం ... అదీ ... ఒక్క 'వసంత్' కోసం ... నూరు 'వసంతాల్ని' దూరం చేసుకోవడమా?

'వాటేషేమ్! టు థింక్ ఎబౌట్ డెత్!'

లైఫ్ ఈజ్ మోర్ ప్రెషియస్ దేన్ లవ్!

'ఆ బాస్టర్డ్... కాదంటే... తనిలా... బేలగా... మరే దిక్కూ లేనట్టు.. చావే సమస్యకు పరిష్కార మని... అందర్నీ వదిలి... అసహ్యంగా... ఇలా...'

దిగ్గున లేచి నిలబడింది!

'తలమీద నుంచి... వేయి టన్నుల బరువు దిగిపోయినట్టు...

మనసు దూదిపింజలా!

ఆమె... 'మనసును' గ్రహించిన మేధావిలా...

సోమరిగా తిరుగుతున్న 'గాలి' సన్నగా ... చిన్నగా ... రివ్వున వీస్తూ ... స్నేహ స్పర్శనందించింది!

'వెన్నెల కాంతులతో ...' వన్నెల్ని సింగారించుకున్న -

'చలిస్తున్న అలల్ని...' సరదాగా వెక్కిరిస్తూ...

సాగిపోయింది... దూరంగా... పార్క్ చేసున్న ... తన 'చెలి' కైనెటిక్ హోండా... వైపు...

వెన్నెలపరచిన 'చల్లదనాన్ని' ఆనందంగా ఆస్వాదిస్తూ...

'మధురిమ్', 'ది బ్రిలియంట్ స్టూడెంట్' ఆఫ్ 'సైకాలజీ.'

## 'రిటైర్మెంట్'

ఇన్నినాళ్ళ
సర్వీసు 'గొప్ప'తనాన్ని
నెమరేసుకుని...
సహోద్యోగుల పొగడ్తలను
నిండారా నింపుకుని...
రేపటి నుండి నీకు 'అర్హత'
లేదనే కుర్చీని చూసుకుని...
చేతిలో దండతో...
'ఆటో'లో కూర్చున్న నీకు మిత్రుల
సోదర వీడ్కోలు
అక్కడి నుండి... ఆలోచనల ప్రయాణంలో
అలసి...
ఇంటి ముందు ఆటో ఆగిన శబ్దానికి
ఎవరా? అంటూ చూస్తోన్న కుటుంబ సభ్యుల
చూపులకు కొత్త కొలతలు తీసుకుంటూ
రేపటికాలం అప్పటి వరకూ లేని
వృద్ధాప్యపు ముసుగులు తొడుక్కుని
ప్రశ్నార్థకమవుతోంటే
భవిష్యత్తులోకి
ఓరకంట ఆలోచనలతో చెలిమి
నిద్రలేని రాత్రితో... మైత్రి
సర్వీసు నుండి రిటైర్ అయినా
రి'టైర్' తప్పదా...
ముందు బతుక్కి.

-జి.ఎస్.వి. సత్యనారాయణ